క్లుప్తంగా...

నేడు చార్మినార్ వద్ద దశాబ్ది వేడుకలు



మహ్మద్ సలావుద్దీన్ లోధి

చార్మినార్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ఉదయం చారిత్రక చార్మినార్ వద్ద జాతర జాతీయ పతాకావిష్కరణ చేసి సంబరాలు నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గం ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఒకప్పుడు కేవలం 12 ముస్లిం రెసిడెన్షియల్ పాఠశాలలు మాత్రమే ఉండగా నేడు వాటి సంఖ్య 260కి పెరిగిందన్నారు. ఆయా పాఠశాలల్లో 1,40,000 మంది ముస్లిం విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నట్లు తెలిపారు. పాతబస్తీలో ముర్గీచౌక్, మీరాలంమండీ, గుల్జార్‌హౌజ్ ఫౌంటెన్, సర్దార్ మహల్ భవనాల ఆధునికీకరణ పనులు కొనసాగుతున్నాయన్నారు.

ఉద్యమకారులకు ప్రాధాన్యం ఇవ్వాలి



గడ్డమీది హరినాథ్ గౌడ్

చార్మినార్: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జూన్ 2న నిర్వహించనున్న కార్యక్రమాల్లో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి గౌరవించాలని తెలంగాణ ఉద్యమకారుడు గడ్డమీది హరినాథ్ గౌడ్ అన్నారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో ఎందరో అమరులయ్యారని, ఎంతో మందిపై అక్రమ కేసులు నమోదయ్యాయన్నారు. ఉద్యమకారులను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో అమరులైన కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

గోల్కొండకు మారనున్న టోలీచౌకీ ట్రాఫిక్ పీఎస్

గోల్కొండ: టోలీచౌకీ సాలార్జంగ్ కాలనీలో ఉన్న టోలీచౌకీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు గోల్కొండకు మారింది. గోల్కొండ పాత పోలీస్ స్టేషన్ భవనంలో టోలీచౌకీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకుగాను ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి.

ఆవిర్భావ వేడుకలకు ముస్తాబు



విద్యుద్దీపాల వెలుగులో ఐఎస్‌సదన్ పోలీస్ స్టేషన్ భవనం

సంతోష్‌నగర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని కంచన్‌బాగ్, సంతోష్‌నగర్, ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్లను గురువారం రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ నెల 2వ తేదీ నుంచి రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేపట్టారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్, కార్పొరేటర్ అర్చన జయప్రకాష్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని, ఇందులో భాగంగా రూ.కోట్ల విలువైన అభివృద్ధి పనులను చేపడుతున్నామని ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. గురువారం రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని శివరాంపల్లి, బుద్వేల్, రాజేంద్రనగర్ పత్తికుంట ప్రాంతాల్లో కార్పొరేటర్ అర్చన జయప్రకాష్‌తో కలిసి రూ. 3.97 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నామన్నారు. బస్తీలు, కాలనీల అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నామన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు నాయకులు కాలనీల్లో పర్యటించాలని, తాము గుర్తించిన సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. వాటిపై ప్రత్యేక సమీక్ష నిర్వహించి అధికారులతో చర్చించి నిధులను మంజూరు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి పలుగుచెరువు మహేష్, రగడంపల్లి శ్రావణ్, సాయి మాలిక్, అక్కిరాజు రాధేశ్యాం, పడమటి శ్రీధర్, యాదయ్యయాదవ్, సాయిగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, రఘు ముదిరాజ్, కొమురయ్య, వై.శ్రీధర్, జోగి రవి తదితరులు పాల్గొన్నారు.

మట్టి కుప్పలు..మురుగు నీరు

- సమస్యలకు నిలయంగా రింగ్ రోడ్డు
- పలు ప్రాంతాల్లో పొంగి పొర్లుతున్న డ్రైనేజీ
- రోడ్లపై యథేచ్ఛగా గృహ నిర్మాణ వ్యర్థాల డంపింగ్



రహదారిపై పారుతున్న మురుగునీరు

జియాగూడ: పురానాపూల్ రింగ్‌రోడ్డుపై నానాటికి సమస్యలు తీవ్రమవుతున్నాయి. పలు ప్రాంతాల్లో డ్రైనేజీ పొంగిపొర్లుతోంది, గృహ నిర్మాణ వ్యర్థాలను రోడ్డుపై పోస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్రమ పార్కింగ్, చెత్తా చెదారం కారణంగా ఆయా ప్రాంతాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. పురానాపూల్ నుంచి రాంసింగ్‌పురా వరకు గల రింగ్‌రోడ్డు సమస్యలకు నిలయంగా మారింది. దీనిపై పలుమార్లు ఆయా ప్రాంతాల ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునేవారు కరువయ్యారు.

పొంగి పొర్లుతున్న డ్రైనేజీ..

పురానాపూల్ నుంచి రింగ్‌రోడ్డు మధ్యలో జియాగూడ బస్తీలకు చెందిన మురుగునీరు పొంగి పొర్లుతోంది. ఈ ప్రాంతంలో చేపట్టిన పైప్‌లైన్ నిర్మాణం నత్తనడకగా కొనసాగుతోంది. దీంతో ఆయా బస్తీల మురుగునీరు రోడ్డుపై పారుతుండడంతో దుర్గంధంతో పాటు దోమల కారణంగా బస్తీవాసులు అనారోగ్యం బారిన పడుతున్నారు. సమస్యపై డివిజన్–3, ఏరియా అసిస్టెంట్ ఇంజినీర్లకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యథేచ్ఛగా మట్టి డంపింగ్.......

రింగ్ రోడ్డులో అక్రమంగా రాత్రివేళల్లో గృహ నిర్మాణ వ్యర్థాలను లారీల్లో తీసుకువచ్చి రహదారిపై పోస్తుండటంతో రహదారి కాస్తా కుంచించుకుపోతుంది. మురుగునీరు, మట్టికుప్పల కారణంగా వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అక్రమంగా మట్టి పోసేవారిపై జీహెచ్ఎంసీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. రాత్రి వేళల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జియాగూడ బస్తీలవాసులు కోరుతున్నారు.



రోడ్డుపై మట్టికుప్పలను డంపింగ్ చేసిన దృశ్యం

గోల్కొండ ఆస్పత్రికి కాయకల్ప్ అవార్డు



ఎమ్మెల్యేతో గోల్కొండ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా తదితరులు

గోల్కొండ: నగరంలోని ఏరియా ఆస్పత్రుల్లో గోల్కొండ ఏరియా ఆస్పత్రి మొదటి స్థానంలో ఉందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. గోల్కొండ ఏరియా ఆస్పత్రికి ప్రతిష్టాత్మక కాయకల్ప్ అవార్డు వచ్చిన సందర్భంగా ఆయన గురువారం ఏరియా ఆస్పత్రి వైద్యులను సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...... రెండు దశాబ్దాల్లో అంచెలంచెలుగా అభివృద్ధి చెందిన గోల్కొండ ఏరియా ఆస్పత్రి నేడు కార్పొరేట్ హంగులు సంతరించుకుందన్నారు. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆస్పత్రి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారన్నారు. ఆస్పత్రి వైద్యులు, వైద్య సిబ్బంది సమష్టి కృషితోనే కాయ కల్ప్ అవార్డు దక్కిందన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా మాట్లాడుతూ.... ప్రైమరీ, సెకండరీ, సేవలతో పాటు హెల్త్ కేర్ ఫెసిలిటీస్ అందిస్తున్నామన్నారు. కాయకల్ప్‌లో పొందుపరిచిన అన్ని నిబంధనలు, సూచనలను 100 శాతం పాటిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు ఆస్పత్రి, ఓపీ, ఐటీ విభాగాలతో పాటు ఆపరేషన్ థియేటర్‌ను కూడా పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ అవార్డు ద్వారా అందిన నగదు ప్రోత్సాహకాన్ని ఎమ్మెల్యే సలహాలు, సూచనల మేరకు సద్వినియోగం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్ఎంఓ మహ్మద్ ఖాజా రవూఫ్ ఉద్దీన్, వైద్యులు, వైద్య సిబ్బందితో పాటు నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు



వాటర్‌బోర్డు జీఎం జాన్ షరీఫ్‌తో సమావేశమైన ఆనంద్‌కుమార్ గౌడ్ తదితరులు

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గ పరిధిలో నెలకొన్న వాటర్‌బోర్డు సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని వాటర్‌బోర్డు 4వ డివిజన్ జీఎం జాన్ షరీఫ్ అన్నారు. జాంబాగ్, కట్టెలమండీ తదితర ప్రాంతాల్లో నెలకొన్న వాటర్‌బోర్డు సమస్యలను బీఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ జీఎం జాన్ షరీఫ్‌కు వివరించారు. గురువారం జీఎంతో సమావేశమైన ఆయన బస్తీలవారీగా వాటర్‌బోర్డు సమస్యలను జీఎం దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా జాన్ షరీఫ్ మాట్లాడుతూ.... సంబంధిత డీజీఎంలు, మేనేజర్లు వాటర్ బోర్డు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తారన్నారు. కట్టెలమండిలో కొత్తగా నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని, ఆ ప్రాంతంలో కొత్తగా మోటర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నందుకుమార్, నాగరాజు, ఓం, గుమన్‌సింగ్ రాజ్ పురోహిత్, బాల్‌రాజ్, ప్రవీణ్ యాదవ్, సత్యనారాయణ, శ్రీనివాస్, పుష్ప, సూరజ్, జావీద్, ఆదిల్, అస్లాం నదీమ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే



ప్రతి ఇంటిపై కమలం పువ్వు కార్యక్రమంలో పాల్గొన్న శ్యామ్‌రాజ్, ఎ. శివచంద్రగిరి

గౌలిపురా: ప్రతి ఇంటిపై కాషాయ జెండా ఎగిరేలా యువ మోర్చా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని బీజేవైఎం జాతీయ కార్యదర్శి, తెలంగాణ ఇన్‌చార్జి శ్యామ్‌రాజ్ అన్నారు. గురువారం బీజేవైఎం భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు శివచంద్రగిరి ఆధ్వర్యంలో గౌలిపురాలో 'ప్రతి ఇంటిపై కమలం పువ్వు' అనే నినాదంతో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2023లో తెలంగాణలో అధికారం చేపట్టేది బీజేపీ ప్రభుత్వమేనని... గోల్కొండ కోటపైన కాషాయ జెండా తప్పకుండా ఎగరవేస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం యువ మోర్చా నాయకులు, కార్యకర్తలపైన ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడేది లేదన్నారు. రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని పోలీసు అధికారులు గుర్తించుకోవాలని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్, నాయకులు అనంత కృష్ణ, ధీరజ్‌లాల్, భానుప్రకాశ్, దినేశ్, రామన్ రాజ్, దశరథ లక్ష్మీ, జగన్మోహన్, ఈశ్వర్ యాదవ్, సచిన్, ఆశీష్ దూబే, దయాకర్, వెంకటేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు మానవాళికి జీవనాధారం



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వక్తలు

సుల్తాన్‌బజార్: మొక్కలు మానవాళికి జీవనాధారమని పలువురు వక్తలు అన్నారు. తెలంగాణలోని వివిధ రకాల మొక్కలు, వైవిధ్యం, వాటి ప్రాధాన్యతపై గురువారం కోఠిలోని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంలో బోటనీ శాఖ ఆధ్వర్యంలో 'డైవర్సిటీ అండ్ యుటిలైజేషన్ ఆఫ్ ప్లాంట్స్' సదస్సును ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ (న్యూఢిల్లీ), ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (బెంగళూర్) ది నేషనల్ అకాడమి ఆఫ్ సైన్సెస్ (ప్రయాగ్ రాజ్) సౌజన్యంతో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ విజ్జులత మాట్లాడుతూ ఔషధ మొక్కలు వ్యవసాయ రంగానికి ఎంతగానో తోడ్పాటును అందిస్తాయన్నారు. మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. మొక్కల నుంచి ప్రతి రోజూ 660 లీటర్ల ఆక్సిజన్ లభిస్తుందన్నారు. ఇది 15 లక్షల వెంటిలేటర్లతో సమానమన్నారు. మొక్కల ప్రాధాన్యత, వాటి రసాయన విశ్లేషణలపై విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సైంటిస్ట్ ప్రొఫెసర్ సి.మనోహర చారి, సైంటిస్ట్ డాక్టర్ ఆర్.రాఘవేంద్రరావు, డాక్టర్ ఎం.సంజప్ప, డాక్టర్ పీఆర్.సుష్మ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై కత్తితో దాడి

జియాగూడ: ఓ యువకుడిపై ముగ్గురు వ్యక్తులు కత్తితో దాడికి పాల్పడిన సంఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కామాటి పురాలో ఉంటున్న షేక్ అహ్మద్ రౌడీషీటర్. గతంలో అతను టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ ప్రాంతానికి చెందిన సోహేల్‌పై కత్తితో దాడి చేశాడు. కాగా బుధవారం రామ్‌సింగ్‌పురా క్రౌన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వేడుకలకు షేక్ అహ్మద్‌తో పాటు అతడి ప్రత్యర్థులు సల్మాన్, సోహెల్, అమీర్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారి మధ్య గొడవ జరగడంతో ఫంక్షన్ హాల్ గేటు వద్ద షేక్ అహ్మద్‌పై సోహేల్, సల్మాన్, అమీర్ కత్తితో దాడిచేసి పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన షేక్ అహ్మద్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలి

గౌలిపురా: బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో ఎవరికీ ఇప్పటి వరకు రుణాలు మంజూరు కాలేదని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేశ్ గురుస్వామి అన్నారు. రుణాల కోసం 5.60 లక్షల మంది దరఖాస్తులు చేసుకోగా ఇప్పటి వరకు రుణాలు మంజూరు చేయలేదన్నారు. జనాభాలో 55 శాతం ఉన్న బీసీల పట్ల ప్రభుత్వం వివక్ష చూపుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు దళిత బంధువు కింద రూ.10 లక్షలు ప్రకటించిన ప్రభుత్వం బీసీలకు కూడా రూ.10 లక్షల సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలన్నారు. ఇటీవల బీసీ కులవృత్తుల వారికి ప్రకటించిన రూ.లక్ష దేనికి సరిపోవన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా గత ఎనిమిదేళ్లుగా సబ్సిడీ రుణాలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి అర్హులకు రుణాలు మంజూరు చేయాలని కోరారు.

పకడ్బందీగా ఓటర్ల నమోదు



సమావేశంలో ఎమ్మెల్యే రాజాసింగ్, భీశ్వ ఓంప్రకాష్ తదితరులు

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గ పరిధిలో ఓటర్ల నమోదు ప్రక్రియ సక్రమంగా జరిగే విధంగా బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. ఓటర్ల నమోదుపై గురువారం ఏర్పాటు చేసిన మహాజన్ సంపర్క్ అభియాన్ సమావేశంలో ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది అన్ని ప్రాంతాల్లో కొత్త ఓటర్ల నమోదు సక్రమంగా చేపట్టేలా బీజేపీ కార్పొరేటర్లు, నాయకులంతా ప్రతి రోజు వారి వెంట ఉండాలన్నారు. కాలనీలు, బస్తీల్లో పర్యటించి ఓటర్ల జాబితా తయారీ రూపకల్పనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షులు వి.పాండుయాదవ్, రాష్ట్ర ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు భీశ్వ ఓంప్రకాష్, బీజేపీ నాయకులు ఎం.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల సమయంలో సంయమనం పాటించాలి



మాట్లాడుతున్న గోల్కొండ ఇన్‌స్పెక్టర్ ఎన్ వెంకటేశ్వర్లు

గోల్కొండ: స్థానికంగా జరిగే ఉత్సవాలు, పండుగలు పతాకావిష్కరణ వేడుకల సందర్భంగా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని గోల్కొండ ఇన్‌స్పెక్టర్ ఎన్. వెంకటేశ్వర్లు అన్నారు. గోల్కొండ కోటలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా గురువారం ఆయన గోల్కొండ పోలీస్ స్టేషన్‌లో మైత్రి కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గోల్కొండ కోట విభిన్న వర్గాల ప్రజలకు నిలయమని ఒకరిని ఒకరు గౌరవించుకుంటూ ఇరువర్గాల వారు పండుగలు, వేడుకల్లో పాల్గొనాలన్నారు. కోటలో జరిగే పతాకావిష్కరణ వేడుకల్లో సైతం మైత్రి కమిటీ సభ్యులు తమవంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు రాజువస్తాద్, సభ్యులు ఆబెద్, అక్బర్, షాన్వాజ్ ఖాన్, ఎం.ఎ.బేగ్, మీర్జా ఎక్బాల్ అహ్మద్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌కే సమాజ్ సేవలు అభినందనీయం



సదానందం గుప్తా తదితరులను సత్కరిస్తున్న దృశ్యం

అబిడ్స్: సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎస్ఎస్‌కే సమాజ్ ఎల్లప్పుడూ ముందుంటుందని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు మేడిశెట్టి సదానందం గుప్తా అన్నారు. రహింపురాలోని ఎస్ఎస్‌కే సమాజ్ నిర్వాహకులు గురువారం సదానందం గుప్తాలతో పాటు పలువురు నాయకులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సదానందం గుప్తా మాట్లాడుతూ... ఎస్ఎస్‌కే సమాజ్ విద్యారంగంతో పాటు పలు రంగాల్లో చేస్తున్న సేవలు అమోఘమన్నారు. పేద బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌కే సమాజ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ కోట బోనాలకు ప్రపంచ స్థాయి గుర్తింపు



కేంద్రమంత్రికి జ్ఞాపిక అందజేస్తున్న బి.సాయిబాబాచారి

గోల్కొండ: గోల్కొండ కోటలో జరిగే బోనాలకు ప్రపంచ స్థాయి గుర్తింపు ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. శ్రీ గోల్కొడ జగదాంబిక మహంకాళీ అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షులు బొమ్మల సాయిబాబాచారి గురువారం కేంద్రమంత్రిని కలిసి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ గోల్కొండ కోటలో జరిగే బోనాలకు ఎంతో చరిత్ర ఉందని, కోటకు వచ్చే విదేశీ పర్యాటకులు బోనాల ఉత్సవాలను తిలకించి ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. కోటలో జరిగే బోనాలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. శ్రీకాంత్ చారి పాల్గొన్నారు.

యువతకు ప్రాధాన్యం



నియామక పత్రాలను అందజేస్తున్న శ్రీధర్

గన్‌ఫౌండ్రీ: రాబోయే ఎన్నికల్లో ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ యువతకు ప్రాధాన్యత ఇస్తుందని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు కె.జి.శ్రీధర్ అన్నారు. గురువారం గన్‌ఫౌండ్రీలోని పార్టీ కార్యాలయంలో జరిగిన యువజన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఐదు సూత్రాలతో ప్రజల్లోకి వెళ్తున్నట్లు తెలిపారు. జూన్ నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో సేవా కార్యక్రమాలతో పాటు సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం పలు నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌లను నియమించారు. కార్యక్రమంలో యువజన విభాగం గ్రేటర్ అధ్యక్షులు నవీన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మహిళా నాయకురాలు అరుణారెడ్డి, మానస తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌స్టార్ కృష్ణ చిరస్థాయిగా నిలిచి ఉంటారు



సీనియర్ నటి ప్రభను సన్మానిస్తున్న మురళీమోహన్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: సూపర్‌స్టార్ కృష్ణ తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని పలువురు ప్రముఖులు కొనియాడారు. గురువారం రవీంద్ర భారతిలో కళాదర్బార్ సంస్థ ఆధ్వర్యంలో దివంగత నటుడు కృష్ణ 80వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నటులు చంద్రమోహన్, మురళీమోహన్, ప్రభ, కవిత, భానుచందర్‌లను ఘనంగా సన్మానించారు. అంతకు ముందు కృష్ణ సినీ గీతాల విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో సినీ నటులు జ్యోతిరెడ్డి, రూప లక్ష్మీ, సంస్థ అధ్యక్షులు పాత్తూరి రంగారావు తదితరులు పాల్గొన్నారు.